క్లుప్తంగా

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

గుడిపాల: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించే ఈ సదస్సుల్లో రైతుల సమస్యలను పరిష్కరించనున్నట్లు వివరించారు. 6వ తేదీన నారగల్లు పంచాయతీ, 7న 189కొత్తపల్లె, 10న గుడిపాల, 11 ముత్తుకూరుపల్లె, 190రామాపురం, 12న శ్రీరంగంపల్లె, 13న చిత్తపార, బండపల్లె, 17న 197రామాపురం, 18న గొల్లపల్లె, క్రిష్ణజమ్మాపురం, 19న బసవాపల్లె, 20న ఏఎల్‌పురం, 21న సీఎం కండ్రిగ, 24న ఖైదుగాని కండ్రిగ, 26న తిమ్మయ్యపల్లె, 27 కుప్పిగానిపల్లె, 28న నంగమంగళం, మందిక్రిష్ణాపురం, 31న డిబిపల్లె, జనవరి 2న మరకాలకుప్పం, 3న వసంతాపురం, 4న చీలాపల్లె, 7న మొగరాల్లపల్లె, 8న బొమ్మసముద్రంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించాలి


ఎంఈఓకి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బంగారుపాళెం: ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగించాలంటూ బుధవారం సాయంత్రం మండల యూటీఎఫ్ నాయకులు ఎంఈఓ నాగేశ్వర్ రావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. అధ్యక్ష కార్యదర్శులు మహేష్‌బాబు, మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉపాధ్యాయులపై పనిభారం పెరిగిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు మానసిక ఆందోళన, ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. అపార్ కార్డుల నమోదు, పది శాతం ఉపాధ్యాయులకు మాత్రమే సెలవు, సెలవు రోజుల్లో కూడా 10వ తరగతి విద్యార్థుల పరీక్షల కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించడం వంటి అంశాలపై ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేయడంపై నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు బాలాజీ, జిల్లా కార్యదర్శి సరిత, మండల నాయకులు పాల్గొన్నారు

ఐరాల విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

ఐరాల: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించినట్లు బుధవారం పాఠశాల హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో గత నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-19 ఫెన్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి పతకాలు సాధించారని పేర్కొన్నారు. టీమ్ ఈవెంట్ సాబార్ విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆసియా బంగారు పతకం, లోకేష్ రజత పతకం సాధించారని తెలిపారు. ఈపీఈఈ విభాగంలో దినేష్‌రెడ్డి, గణేష్ రజత పతకాలు, మైథిలి, మొగిలీశ్వరి కాంస్య పతకాలు సాధించి పాఠశాలకు మంచి పేరు, ప్రఖ్యాతులు తీసుకువచ్చారని కొనియాడారు. క్రీడాకారులను, పీడీ దేవా, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవకార్తీక్‌ను పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యతోపాటు క్రీడలు ముఖ్యం


యశ్వంత్‌ను అభినందిస్తున్న తేజోమూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ముఖ్యమని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి అన్నారు. నగరంలోని బుధవారం మిట్టూరులో ఉన్న విజయం డిగ్రీ కళాశాలలో కుస్తీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం బీకాం చదువుతున్న విద్యార్థి యశ్వంత్ బెంగళూరులో నిర్వహించే నేషనల్ కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. నవంబర్ 9, 10 తేదీల్లో కళ్యాణదుర్గంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో 75 కేజీల కేటగిరీలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు.

పేదలందరికీ ఉచిత వైద్యసేవలు


వైద్యసేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: పేదలందరికీ ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని దిగువమాఘంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ 37 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

40 మందికి వైద్య పరీక్షలు

మండలంలోని అరగొండలో 40 మందికి వైద్య పరీక్షలు చేయించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

నరక దారులు


ఈ చిత్రంలో కనిపిస్తున్నది చిన్నపాటి కుంటనుకుంటే పొరబాటే. ప్రతి రోజూ రాకపోకలు సాగించే వీధి. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఇలా కుంటను తలపిస్తోంది. మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో ప్రధాన వీధి ఇది. - బంగారుపాళెం

ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు గ్రామీణ రోడ్లు ఛిద్రమయ్యాయి. ప్రధాన రహదారులన్నీ గుంతలతో నిండిపోయాయి. మరి కొన్ని చోట్ల బురదగుంటలుగా మారాయి. వాహనాలు తిరిగే రోడ్లేనా ఇవి అన్నట్లుగా కుంటలు, బావుల మధ్య కాలిబాటలుగా కనిపిస్తున్నాయి. ఈ మార్గాలు అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. రోడ్లపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులకు నరకప్రాయంగా మారింది. పలువురు ద్విచక్రవాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించిన ఈ రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాల్సిన ఉంది. కనీసం ఈ రోడ్లలో ఉన్న గుంతల్లో మట్టిని పోసి చదునుచేయాల్సిన అవసరం ఉంది.


చిత్తూరు నగరం సంతపేట సమీపంలోని చవటపల్లె రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలు ఉండడంతో అటువైపు వెళ్లాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చీకటివేళ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. - చిత్తూరు కార్పొరేషన్


బంగారుపాళెం: వీధిలో నిలిచిన వర్షపునీరు


గుడిపాల మండలం నరహరిపేట నుంచి బసవాపల్లెకు వెళ్లే రోడ్డు మార్గం అధ్వానంగా మారింది. దీంతోపాటు 197 రామాపుర రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. రాకపోకలకు నానాఅగచాట్లు పడుతున్నారు. - గుడిపాల


చిత్తూరు: కొలనును తలపిస్తున్న చవటపల్లె రోడ్డు

విద్యార్థులు ఉన్నత ఆశయంతో ఎదగాలి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత ఆశయంతో ఎదగాలని విజయం విద్యాసంస్థల డైరెక్టర్ శైలజా అన్నారు. నగరంలోని గిరింపేట నగరపాలక హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన గుర్తింపు కార్డుల వితరణ కార్యక్రమంలో ఆమె అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు పటిష్ట ప్రణాళికతో విద్యనభ్యసించాలని తెలిపారు. పేద విద్యార్థులకు తమ వంతు సాయంగా గుర్తింపు కార్డులు అందజేయడం సంతోషకరమన్నారు. పేద విద్యార్థులకు సహాయం చేసేందుకు విజయం విద్యాసంస్థ తరఫున ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. హెచ్‌ఎం రమేష్‌బాబు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థుల ప్రగతికి టీచర్లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే స్టూడెంట్స్ కిట్స్‌తో పాటు దాతలు అందజేస్తున్న గుర్తింపు కార్డులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం 550 మంది విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు లోకేష్, గ్లోరీ, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ



కిట్లు అందజేస్తున్న మేయర్, కమిషనర్

చిత్తూరు అర్బన్ : నగరపాలక పరిధిలోని సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు పీపీఈ కిట్లను నగర మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్ పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం, నేషనల్ సఫారీ కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ×నమస్తే కార్యక్రమంలో భాగంగా బుధవారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగరంలో గుర్తింపు పొందిన సెప్టిక్ ట్యాంక్ వర్కర్లకు పీపీపీ కిట్లు (రక్షణ పరికరాలు) పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ, విధులు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసిన పీపీఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా. లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ హేమలత, హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి

తవణంపల్లె: ప్రత్యేక అవసరాల (దివ్యాంగుల) పిల్లలకు ప్రభుత్వం అన్ని విధాల చేయూతనిస్తోందని ఎంఈఓ హేమలత తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం స్థానిక హైస్కూల్లోని భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బహుమతుల ప్రదానం కార్యక్రమంలో ఎంఈఓ హేమలత మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించి తమ ప్రతిభచాటాలని సూచించారు. ప్రభుత్వం భవిత కేంద్రానికి, పాఠశాలల్లో చదువుకోవడానికి వచ్చే దివ్యాంగుల పిల్లలకు రవాణా ఖర్చుల కింద ఏటా రూ.3 వేలు అందిస్తోందని వివరించారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు దివ్యాంగుల పిల్లలకు ఇళ్లకు వెళ్లి బోధన చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి మాట్లాడుతూ భవిత కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సహిత విద్యా ఉపాధ్యాయులు దేవేంద్ర, ఢిల్లీబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హలో బీసీ-చలో ఢిల్లీ'

చిత్తూరు రూరల్ (కాణిపాకం): హలో బీసీ-చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జ్ఞానజగదీష్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గురు, శుక్రవారాల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు.

మంత్రి ప్రకటన దారుణం

చిత్తూరు కార్పొరేషన్: కడప స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు బుధవారం ఒక ప్రకటనలో తప్పుపట్టారు. కడపలో నిర్మించాల్సిన ఉక్కుపరిశ్రమపై కేంద్ర మంత్రి ప్రకటన వెనుకబడిన రాయలసీమ ప్రజలను మోసం చేయడమేనన్నారు.

జలకళ



గుడిపాల: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువులకు జలకళ వచ్చింది. మండలంలో నారగల్లు చెరువు మొరవపోతోంది. మిగతా చెరువులన్నింటికీ సగానికి పైగా నీరు వచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పంటలు ధ్వంసమయ్యాయి. వంకల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అడుగంటిన బావుల్లోనూ నీరు చేరింది.

ఉరుస్తున్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం


కార్యాలయంలో ఫ్లోర్‌పై చేరిన నీరు

చిత్తూరు కార్పొరేషన్: వర్షం పడితే జిల్లా ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఉరుస్తోంది. భవనంలోని పలు గదులు గోడలు తడిబారుతున్నాయి. గాలి వాన వచ్చినప్పుడు నీరు మొత్తం ఫ్లోర్‌పై నిలిచిపోతోంది. దీంతో ఉద్యోగుల అటువైపుగా రాకపోకలు సాగించాలంటే తిప్పలు పడుతున్నారు.

ఆరోగ్య పరిరక్షణ అవసరం

ఐరాల: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో తగినంత వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ హిందువులకు రక్షణ కల్పించండి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్

చిత్తూరు కలెక్టరేట్ : బంగ్లాదేశ్ హిందువులకు రక్షణ కల్పించాలని బీజేపీ సీనియర్ నాయకులు కొల్లా చిట్టిబాబు అన్నారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కట్టమంచి వివేకానంద స్వామి విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మూడు నెలలుగా కొనసాగిన విధ్వంసకాండలో లెక్కకు మించి హిందూ దేవాలయాలు, ఇస్కాం మందిరాలు ధ్వంసం అయ్యాయని చెప్పారు. హిందూ మహిళలపై అత్యాచారాలు జరపడం బాధాకరమన్నారు. హిందూ దుకాణాలను, కుటుంబాలను లూటీ చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ స్త్రీల పట్ల చెప్పలేని, చూడలేని దారుణ మారణకాండను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇస్కాన్ గురువు చిన్మయి కృష్ణదాస్‌ను దేశద్రోహం నేరం కింద అరెస్టు చేయడం సబబు కాదన్నారు. ఆయన తరఫున కోర్టులో వాదించడానికి ముందుకొచ్చిన అడ్వకేట్‌ను చంపేశారన్నారు. ఇలాంటి దారుణ కృత్యాలకు పాల్పడుతున్న బంగ్లాదేశ్ తన ధోరణి మార్చుకోవాలన్నారు. బంగ్లాదేశ్ హిందువులను కాపాడి, కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లను వినతి రూపంలో డీఆర్‌వో మోహన్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం, విశ్వహిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీ, భజరంగ్‌దళ్, హిందుత్వ సంస్థలకు చెందిన బాబుకిరణ్, రఘు, శివ, రామ్మూర్తి, బ్రహ్మానందరెడ్డి, కేఎం.కుమార్, వెంకటేశ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో ఏపీ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నీ


మీడియాతో మాట్లాడుతున్న శివకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఈ నెల 7, 8 తేదీల్లో క్యారమ్స్ ఏపీ ర్యాంకింగ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా క్యారమ్స్ సంఘం అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీలోని వివిధ జిల్లాల్లో 1 నుంచి 6 ర్యాంకింగ్‌లు ఉన్న క్యారమ్స్ ఆటగాళ్లు టోర్నీలో పాల్గొంటారన్నారు. ఈ టోర్నీ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని, పురుషులు, మహిళలు, వెటరన్స్ విభాగంలో పోటీలు జరుగుతాయని చెప్పారు. టోర్నీలో ఎంపికయ్యే క్రీడాకారులు 2025 జనవరిలో నెల్లూరు జిల్లాలో జరిగే జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో తలపడతారని వెల్లడించారు.

విద్యా సామర్థ్యాలను పెంచేందుకే తరల్


తరల్ శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ నాగేశ్వర్‌రావు

బంగారుపాళెం: చదువులో వెనుకబడిన విద్యార్థుల సామర్థాలను తెలుసుకుని వారిని ముందుకు తీసుకువెళ్లడమే తరల్(టీచింగ్ అట్ రైట్ లెవెల్)కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల విద్యాశాఖాధికారులు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఉపాధ్యాయులకు రెండు రోజుల తరల్ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. మండలంలో 3, 4, 5 తరగతులు బోధించే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాలలో తెలుగు, గణితం బోధించే ఉపాధ్యాయులు శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఎంఈఓలు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయి విద్యార్థులు ఏ సామర్థ్యంలో అయితే వెనుకబడి ఉన్నారో అటువంటి వారిని గుర్తించి ఆ సామర్థ్యాన్ని నేర్పించేందుకు తరల్ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. టీచింగ్ అట్ రైట్ లెవెల్ కార్యక్రమం ద్వారా పిల్లలకు ఏవిధంగా బోధించాలనే అంశాలను రిసోర్స్ పర్సన్లు చంద్రశేఖర్, రామకృష్ణ షభానా బాను, మమత ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ.43వేల జరిమానా


సోషల్ ఆడిట్ సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ రవికుమార్

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన 17వ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పలువురు సిబ్బందికి డ్వామా పీడీ రవికుమార్ జరిమానా విధించారు. మండలంలోని 28 పంచాయతీల్లో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, అటవీ శాఖ, హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించి 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మొత్తం 2,242 పనులకు గానూ రూ.5 కోట్లు వ్యయం చేశారు. 2024 నవంబర్ నుంచి డిసెంబర్ 3 వరకు చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. తనిఖీలో గుర్తించిన విషయాలపై చర్చించేందుకు ప్రజావేదిక కార్యక్రమాన్ని డ్వామా పీడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో అక్కడక్కడా మామిడి మరికొన్ని ఇతర చెట్లు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్త వాటిని నాటించని కారణంగా సిబ్బందికి రూ.43వేలు జరిమానా విధించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ వల్ల గ్రామీణ ప్రజలకు లభించే జీవనోపాధితో ఆర్థిక అభ్యున్నతిని మెరుగుపరుచుకోవాలన్నారు. చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పలు రకాల పండ్ల తోటల పెంపకం, భూమి చదును లాంటి ఎన్నో పనులకు అవకాశం ఉందని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా నిజాయితీగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, డీపీఓ శివయ్య, ఎస్‌టీఎం లోకేష్, ఏపీఓ సంధ్య, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు, వేతనదారులు, రైతులు పాల్గొన్నారు.